క్లుప్తంగా

జీపీ, గ్రంథాలయ భవన నిర్మాణాలకు స్థల వితరణ



తీర్మాన కాపీని ఎమ్మెల్యేకు ఇస్తున్న సర్పంచ్ తదితరులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని చిట్యాల గ్రామానికి ఇటీవల మంజూరైన నూతన పంచాయతీ, గ్రంథాలయ భవన నిర్మాణాలకు అవసరమైన 300 గజాల కాళీ స్థలాన్ని సర్పంచ్ ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు దానంగా ఇచ్చారు. దీనికి సంబంధించిన పత్రాలను ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సమక్షంలో పంచాయతీ పాలకవర్గానికి అందజేశారు. అదేవిధంగా నూతనంగా నిర్మించే భవనాలకు రామ్మోహన్‌రావు కుటుంబసభ్యుల పేర్లు పెట్టేలా గ్రామ పంచాయతీ పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. తీర్మాన కాపీని ఎమ్మెల్యే సిఫారసుతో కలిపి జిల్లా కలెక్టర్‌కు అందించినట్లు సర్పంచ్ రామ్మోహన్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా త్వరలో ప్రారంభించనున్న భవన నిర్మాణ పనుల భూమిపూజకు రావాలని ఎమ్మెల్యేను ఆహ్వానించారు. సర్పంచ్‌ను ఎమ్మెల్యే అభినందించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సర్పంచ్‌తో పాటు ఆయన భార్య, గ్రామ బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు అనురాధ, కుటుంబ సభ్యులు ఉన్నారు.

కార్న్ కంపోస్ట్ కవర్లనే వినియోగించాలి



కార్న్ కంపోస్ట్ కవర్లను అందజేస్తున్న ఎంపీపీ నిర్మల, సర్పంచ్ మంజుల

బెజ్జంకి(సిద్దిపేట): ప్రభుత్వం నిషేధించిన సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్లకు బదులుగా కార్న్ కంపోస్ట్ కవర్లను వినియోగించాలని బెజ్జంకి ఎంపీపీ లింగాల నిర్మల సూచించారు. బెజ్జంకిలోని పలు వ్యాపార సంస్థల్లో కార్న్ కంపోస్ట్ కవర్ల వినియోగాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యాపారులు తమ కస్టమర్లకు సామగ్రిని కార్న్ కంపోస్ట్ కవర్లలో మాత్రమే ఇవ్వాలన్నారు. ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నిషేధించి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ద్యావనపెల్లి మంజుల, ఎంపీఓ విష్ణు, కార్యదర్శి ప్రణీత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొమురవెల్లిలో రైల్వేస్టేషన్ ఏర్పాటు చేయాలి



బండి సంజయ్‌కి వినతిపత్రం అందిస్తున్న మల్లేశ్

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయం సమీపంలో రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయాలని జిల్లా బీజేపీ నాయకుడు, రాష్ట్ర ఓబీసీ మోర్చా జనరల్ సెక్రటరీ మల్లేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కి బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. కొమురవెల్లి ఆలయం వద్ద తప్పకుండా రైల్వేస్టేషన్ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. వెంటనే ఆయన కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు రికమండేషన్ లెటర్ పంపారు. ఇదే విషయమై భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా రైల్వే జనరల్ మేనేజర్‌కు లెటర్ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి సంగప్ప తదితరులు ఉన్నారు.

దేశానికే ఆదర్శం సీఎం కేసీఆర్ పాలన

తొగుట(దుబ్బాక): సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం బూత్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గుడికందుల బూత్ కమిటీ అధ్యక్షులుగా గురువారెడ్డి, ఈశ్వర్, మంగళి నర్సింలు, కమలాకర్, సోషల్ మీడియా ప్రతినిధులుగా కిష్టయ్య, గోవర్ధనగిరి బూత్ కమిటీ అధ్యక్షుడిగా గడ్డం రాఘవులు, సోషల్ మీడియా ప్రతినిధిగా పరమేశ్వర్, వర్దరాజుపల్లి అధ్యక్షుడిగా జనార్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రాజిరెడ్డి, సోషల్ మీడియా ప్రతినిధులుగా కమలాకర్‌రెడ్డి, సంతోష్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి, సర్పంచ్‌లు గోవర్ధన్‌రెడ్డి, మల్లయ్య, ఎల్లం, రాజవ్వ, రైతుబంధు మండల అధ్యక్షుడు కనకయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, ఆత్మకమిటీ, ఏఎంసీ డైరెక్టర్లు భైరాగౌడ్, బాల్‌రెడ్డి, నాయకులు మల్లారెడ్డి, రాజు, పరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి కట కట..!



ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న లకుదారం గ్రామస్తులు

- ట్యాంకర్లతో నీటి సరఫరా
- బోరుబావులే శరణ్యంగా మారిన వైనం
- పట్టించుకోని అధికారులు



కోలోనివంపులో బోరుబావుల వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

కొండపాక(గజ్వేల్): గ్రామాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. బిందెడు నీటి పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా బోరుబావులను ఆశ్రయిస్తూ నీటిని తెచ్చుకుంటున్నారు. ఓ వైపు వేసవి ఎండలు తీవ్రమవుతుండగా మరోవైపు నీటి సరఫరాకు డిమాండ్ పెరిగిపోతోంది. సరిగా ఇదే సమయంలో మిషన్‌భ భగీరథ నీటి సరఫరా గణనీయంగా పడిపోయింది. గ్రామాల్లో మంచినీటి సమస్యలు ఉండకుండా మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ నీరందిస్తున్నామంటున్న ప్రభుత్వ మాటలు నీటి మూటలుగా నిలుస్తున్నాయి.

- కుకునూరుపల్లి మండలంలోని లకుదారంలో మూడు నెలలుగా తాగునీరు సరిగా రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- గ్రామంలో 2500 జనాభా ఉంటుంది. 500 కుటుంబాలకు గాను మిషన్ భగీరథ పథకంలో 350 నల్లా కనెక్షన్లు ఉన్నాయి.
- కుకునూరుపల్లి మండల కేంద్రానికి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న లకుదారంలో నీటి సమస్యను పట్టించుకునే వారు కరువయ్యారు.
- గజ్వేల్ మండలంలోని కోమటిబండ వద్ద ప్రభుత్వం మిషన్ భగీరథ హెడ్ వర్క్ ట్యాంక్‌ను నిర్మించింది.
- ఇక్కడి నుంచి కుకునూరుపల్లి, కొండపాక మండలాల్లోని గ్రామాల్లో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులోకి నీటిని పంపింగ్ చేస్తుంది. ట్యాంకుల ద్వారా గ్రామాల్లో ప్రతీ రోజు నీరు సరఫరా జరుగుతుంది.
- కోమటిబండ నుంచి లకుదారం గ్రామం సుమారు 28 కిలోమీటర్ల దూరంలో ఉంది. కాకపోతే గ్రామం కొంచెం ఎత్తులో ఉండడంతో భగీరథ నీరు గ్రామంలోని ఓవర్ హెడ్ ట్యాంకుపైకి నీరు పంపింగ్ కావడం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు.
- మూడు నెలలుగా గ్రామానికి భగీరథ నీరు రాకపోవడంతో వేసవి కాలం దృష్ట్యా సర్పంచ్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.
- నీరు సరిపోకపోవడంతో మహిళలు సమీపంలో ఉన్న బోరుబావుల వద్ద నుంచి నీటిని తీసుకొస్తూ ఇబ్బందులు పడుతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- మధిర గ్రామాలైన కాకులోనిగడ్డ, కోలోని వంపులో నివాసం ఉండే ప్రజలకు ట్యాంకర్ ద్వారా కూడా నీరు సరఫరా చేయడం లేదు.
- అసలే ఎండాకాలం బోరుబావుల్లో భూగర్భ జలాలు కనిష్ట స్థాయికి పడిపోయాయి. వరి పంటలు పొట్ట దశకు చేరుకోవడంతో నీటి వినియోగం ఎక్కువగా ఉంటుంది. దీంతో రైతులు బోరుబావుల నుంచి నీటిని తీసుకెళ్లనీయడం లేదంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- మూడు నెలల నుంచి మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదని అధికారులను అడిగితే పట్టించుకోవడం లేదని, ప్రజల ఇబ్బందుల దృష్ట్యా ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నామంటూ సర్పంచ్ కందూరి కనుకవ్వ పేర్కొంది.
- ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ మండల ఏఈ భూపతిని వివరణ కోరగా మిషన్ భగీరథ నీరు పంపింగ్ స్పీడ్ తక్కువగా ఉండటంతో ట్యాంకులోకి నీరు వెళ్లడం లేదు. పంపింగ్ స్పీడ్ పెంచడానికి కృషి చేస్తున్నామన్నారు.

నల్లాల ద్వారా నీరు వచ్చేలా చూడాలి



కాలనీకి రోజుకు ఒక ట్యాంకర్ నీరు వస్తుంది. ట్యాంకర్ వద్ద నీరు పట్టుకోవడానికి చిన్నపాటి యుద్ధం చేయాల్సి వస్తోంది. మిషన్ భగీరథ పథకంలో నల్లాలు పెట్టారు కానీ చుక్కా నీరు రావడం లేదు. అధికారులను అడిగితే పట్టించుకోవడం లేదు. నల్లాల ద్వారా నీరు వచ్చేలా చూడాలి

–ఏల సత్తవ్వ, లకుదారం

బోరుబావులే ఆధారం



పొద్దున లేవగానే బిందెలు పట్టుకొని పిల్లా పాపలతో కలిసి బోరుబావుల వద్దకు వెళ్తున్నాం. వరి పంటకు నీరు ఎక్కువగా అవసరముందంటూ రైతులు బోరు నుంచి నీటిని తీసుకెళ్లనివ్వడం లేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతూ ఎలాగోలా నీటిని తెచ్చుకుంటున్నాం. బావుల వద్ద కరంట్ లేకుంటే వంట చేసుకునే కూడా కష్టంగా మారింది.

–గుర్రాల రూప, కాకులోని గడ్డ

స్పార్క్ లెస్ సమ్మర్ క్యాంప్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, తదితరులు

సిద్దిపేటరూరల్: గురుకుల విద్యాసంస్థల్లో స్పార్క్ లెస్ ప్రోగ్రాం ద్వారా నిర్వహించే సమ్మర్ క్యాంప్స్ కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను బుధవారం కలెక్టరేట్‌లో గురుకుల విద్యాసంస్థల ప్రిన్సిపాల్‌లతో కలిసి కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి మే 6 వరకు స్పార్క్ లెస్ పేరుతో సమ్మర్ క్యాంప్స్ ద్వారా విద్యార్థులకు ఎంపిక చేసిన రంగాల్లో శిక్షణ ఇస్తామన్నారు. ఈ క్యాంప్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఆయా రంగాల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. హుస్నాబాద్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్(బాయ్స్) కాలేజీలో బాలురకు చిత్రలేఖనం, యాంకరింగ్, ఉపన్యాసం, యువ జర్నలిస్ట్, వెస్టర్న్ డ్యాన్స్ రంగాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అదేవిధంగా తొగుట సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గర్ల్స్ కాలేజీలో బాలికలకు లైఫ్ స్కిల్స్, వెస్టర్న్ డ్యాన్స్, బ్యూటీ కేర్, బేసిక్ అబాకస్ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల ఆర్సీఓ కె.నిర్మల, హుస్నాబాద్ గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, తొగుట గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ మెర్సీ వరూధిని, ఇతర గురుకుల విద్యాలయాల ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణాలను హరితవనాలుగా మార్చుతాం

నర్సరీని సందర్శించిన మున్సిపల్ కమిషనర్లు



నర్సరీలో మొక్కలు పరిశీలిస్తున్న కమిషనర్లు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రంగనాయకసాగర్ రిజర్వాయర్ వద్ద ఉన్న నర్సరీని బుధవారం దుబ్బాక, హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్లు గణేశ్‌రెడ్డి, రాజమల్లయ్యలు సందర్శించారు. నర్సరీలో మొక్కలు పెంచుతున్న తీరుపై హరితహారం అధికారి ఐలయ్యను అడిగి తెలుసుకున్నారు. మొక్కల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలపై వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్లు గణేశ్‌రెడ్డి, రాజమల్లయ్యలు మాట్లాడుతూ.. హరితహారంలో సిద్దిపేట రాష్ట్రవ్యాప్త కీర్తిని సొంతం చేసుకుందని, దీనిని ఆదర్శంగా తీసుకొని దుబ్బాక, హుస్నాబాద్ పట్టణాలను హరితవనాలుగా మార్చుతామన్నారు. ఇక్కడ మొక్కల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలు బాగున్నాయన్నారు. వీటిని తమ పరిధిలోని నర్సరీల్లో అమలు పరుస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ రంజిత్‌కుమార్, నర్సరీ సిబ్బంది ఉన్నారు.

వంటావార్పును విజయవంతం చేయండి



కరపత్రాలు పంచుతూ ప్రచారం చేస్తున్న జేఏసీ నాయకులు

చేర్యాల(సిద్దిపేట): మున్సిపల్ పరిధిలో పెంచిన ఇంటి పన్నులను తగ్గించాలని కోరుతూ ఈ నెల 21న అంగడిబజార్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిర్వహించే వంటావార్పును విజయవంతం చేయాలని జేఏసీ చైర్మన్ రామగళ్ల పరమేశ్వర్ పిలుపునిచ్చారు. వంటావార్పు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలంటూ బుధవారం జేఏసీ, అఖిలపక్షం ఆధ్వర్యంలో స్థానిక సుందరయ్యనగర్, బురాన్ మియా తోట, వెలుగలవారి కాలనీ, బండపల్లి, కొట్టేవారి కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెంచిన ఇంటిపన్నులు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ధర్నాలు, బంద్‌లు నిర్వహించినా మున్సిపల్ పాలకవర్గం, అధికార యంత్రాంగం స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను అర్థం చేసుకోకుండా పాలకవర్గం బుకాయింపులు మాట్లాడడం పట్టణ ప్రజలు గమనిస్తున్నారన్నారు. వంటావార్పుకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేఏసీ, అఖిలపక్ష నాయకులు ఆగంరెడ్డి, నర్సింగరావు, కళావతి, యాదయ్య, సత్యనారాయణ, రాజు, రాములు, మహేశ్, కనకయ్య, కనకవ్వ, రజిత తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని అభాసుపాలు చేయడం సరికాదు



మాట్లాడుతున్న శ్రీరాంచక్రవర్తి

హుస్నాబాద్: వ్యక్తిగత అవసరాల కోసమే సీపీఐ ఇతర పార్టీలతో పొత్తులు పెట్టుకుంటుందని, బీఆర్ఎస్ పార్టీకి సీపీఐ బీటీమ్‌గా వ్యవహరిస్తుందని బీజేపీ నియోజకవర్గ నాయకుడు శ్రీరాంచక్రవర్తి అన్నారు. బుధవారం పట్టణంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాంచక్రవర్తి మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఓట్లు, సీట్ల శాతం ఆధారంగా వివిధ పార్టీలకు జాతీయ హోదా ఇస్తుందన్నారు. సీపీఐ పార్టీ జాతీయ హోదా రద్దు చేసిన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి బీజేపీని అభాసుపాలు చేసే విధంగా మాట్లాడటాన్ని ఖండిస్తున్నామన్నారు. దేశంలో సీపీఐ ప్రభావం లేదన్నారు. బడుగు, బలహీన వర్గాల సమస్యలపై పోరాడే సీపీఐ పెత్తందారులు, పెట్టుబడుదారుల బాటలో నడుస్తుందన్నారు. సీపీఐ పొలిటికల్ స్టాండ్ ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశాడు. రైతులకు భరోసా కల్పించేందుకు బీజేపీ శ్రేణులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు శంకర్‌బాబు, జిల్లా కోశాధికారి శ్రీనివాస్, అసెంబ్లీ కో కన్వీనర్ వేణుగోపాల్‌రావు, అక్కన్నపేట మండల అధ్యక్షుడు వీరాచారి, నాయకులు సమ్మయ్య, స్వర్ణలత, రవీందర్, స్వరూప, రాంప్రసాద్ తదితరులు ఉన్నారు.

సీపీఆర్‌పై పోలీస్ సిబ్బందికి శిక్షణ



సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్న 108 వైద్య సిబ్బంది

హుస్నాబాద్: మండల పరిషత్ సమావేశ మందిరంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లకు సీపీఆర్‌పై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రోడ్ సేఫ్టీ అథారిటీ డీఎస్పీ చంద్రబాను హాజరయ్యారు. ఈ మధ్య కాలంలో కార్డియాక్ అరెస్ట్ అవుతున్న వారికి ప్రాథమిక చికిత్సగా సీపీఆర్ ఏవిధంగా చేయాలో, 108 వైద్య సిబ్బందితో కలిసి శిక్షణ ఇప్పించారు. ఇటీవల అకస్మాత్తుగా కార్డియాక్ అరెస్ట్‌కు లోనై వ్యక్తులు ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. అలాంటి సమయంలో ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండే ఆటోడ్రైవర్లు, పోలీస్ సిబ్బంది అంబులెన్స్ వచ్చే వరకు ప్రాథమిక చికిత్సలో భాగంగా సీపీఆర్ చేస్తే ప్రాణాలు కాపాడొచ్చని ఎస్సై మహేశ్ తెలిపారు. ప్రజలు కూడా ప్రమాదాలు జరిగిన సమయంలో మానవత్వంతో స్పందించి బాధితులకు సాయం చేసి వారి ప్రాణాలను కాపాడాలని కోరారు. వాహనాదారులు అతి వేగంగా వెళ్లొద్దని సూచించారు.

నేడు దివ్యాంగుల బస్‌పాస్ మేళా

నంగునూరు(సిద్దిపేట): మండల కేంద్రం నంగునూరులో గురువారం దివ్యాంగుల కోసం బస్‌పాస్ మేళా నిర్వహిస్తున్నామని సిద్దిపేట బస్ డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి తెలిపారు. ఉదయం బస్టాండ్ వద్ద నిర్వహించే క్యాంప్‌కు హాజరయ్యే వారు సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, పాస్‌ఫొటో వెంట తేవాలన్నారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు వినియోగించుకోవాలని చెప్పారు. అదేవిధంగా రవాణా సంస్థ చేస్తున్న సేవలు వివరించడంతో పాటు సలహాలు, ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు.

రంజాన్ కానుకల పంపిణీ



హుస్నాబాద్‌రూరల్: కానుకలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ మానస



వర్గల్: కానుకలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ బాలూయాదవ్

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ లకావత్ మానస రంజాన్‌ను పురస్కరించుకొని ముస్లింలకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుమారస్వామి, కోఆప్షన్ సభ్యుడు సలీం తదితరులు పాల్గొన్నారు.

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలంలోని 16 గ్రామాలకు 400 రంజాన్ తోఫాలు కేటాయించిందని స్థానిక తహసీల్దార్ సతీశ్‌కుమార్ తెలిపారు. వర్గల్‌కు 53, మల్లారెడ్డిపల్లికి 12, నాచారానికి 35, మజీద్‌పల్లికి 30, గౌరారానికి 30, గిర్మాపూర్‌కు 14, వేలూరుకు 40, తున్కిఖాల్సాకు 52, నెంటూరుకు 48, శాకారానికి 20, మాదారానికి 30, మీనాజీపేటకు 20, మైలారానికి 12, జబ్బాపూర్‌కు రెండు, చాంద్‌ఖాన్‌మక్తకు ఒకటి, చౌదరిపల్లికి ఒకటి చొప్పున వచ్చాయన్నారు. ఆయా గ్రామాల ముస్లిం ప్రతినిధులకు బుధవారం జెడ్పీటీసీ బాలుయాదవ్, మండల పరిషత్ కో–ఆప్షన్ మెంబర్ ఫారుఖ్ అలీ, తహసీల్దార్ సతీశ్‌కుమార్ రంజాన్ తోఫాలు పంపిణీ చేశారు.

విద్యార్థులకు ప్రగతి పత్రాలు అందజేయాలి

నంగునూరు(సిద్దిపేట): విద్యా సంవత్సరం ముగింపు రోజు విద్యార్థులకు ప్రగతి పత్రాలు అందజేయాలని ఎంఈఓ దేశిరెడ్డి మండలంలోని హెచ్‌ఎంలకు సూచించారు. బుధవారం నర్మేట కస్తూర్బా పాఠశాలలో హెచ్‌ఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేశిరెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 24న పాఠశాల పనిదినాలకు చివరిరోజు కావడంతో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు పరీక్షా ఫలితాలను ప్రగతి పత్రంలో నమోదు చేసి అందజేయాలన్నారు. అలాగే సెలవు దినాల్లో పాఠశాలను శుభ్రంగా ఉంచడంతో పాటు బడి తెరిచే నాటికి ప్రజాప్రతినిధుల సహకారంతో పాఠశాలలో మౌలిక వసతులు సమకూరేలా చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యాదగిరి, నాగేందర్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్



చేర్యాల: ఇఫ్తార్ విందులో ఏకానందం

చేర్యాల(సిద్దిపేట): రంజాన్ మాసం ఉపవాస దీక్ష సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు, ఉల్లెంగల సేవా ట్రస్ట్ చైర్మన్ ఉల్లెంగల ఏకానందం బుధవారం మండల పరిధిలోని కాశగుడిశెలు గ్రామంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముస్లింలందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. మతసామరస్యానికి ప్రతీక రంజాన్ అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఫకీర్, ముస్లింలు పాల్గొన్నారు.

సిద్దిపేటజోన్: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ(16 వార్డు)లో బుధవారం ముస్లింలకు ఇఫ్తార్ విందు నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, మంత్రి ఓఎస్డీ బాల్‌రాజులు హాజరయ్యారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లికార్జున్, వార్డు ప్రతినిధులు, ముస్లింలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు లిఫ్ట్ వాడొద్దు



సిద్దిపేటలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



దుబ్బాకలో..

సిద్దిపేటజోన్: అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. పాటించాల్సిన చర్యలపై ఆ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా బుధవారం మెదక్ రోడ్డులోని రిలయన్స్ డిజిటల్ స్టోర్స్ సిబ్బందికి మాక్‌డ్రిల్ ద్వారా వివరించారు. అగ్నిప్రమాదాలు జరిగితే వెంటనే 101కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ఫైర్ ఆఫీసర్ సుల్తాన్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

హుస్నాబాద్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని సంఘమిత్ర బీఈడీ కళాశాలలో అగ్గి ప్రమాదాలపై ఫైర్ సిబ్బంది అవగాహన కల్పించారు. కళాశాలలో ఏదైనా అగ్ని ప్రమాదం జరిగినప్పుడు అగ్నిమాపక సాధనాలు ఉపయోగించి మంటలను ఆర్పివేయడం, విద్యార్థులు, సిబ్బంది తమని తాము ఎలా రక్షించుకొని బయట పడాలి అని విన్యాసక రూపంలో చూపించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు లిఫ్ట్‌ను వాడకుండా మెట్లమార్గం ద్వారానే బయటకు రావాలని సూచించారు. కార్యక్రమంలో హుస్నాబాద్ ఫైర్ అవుట్ పోస్ట్ ఇన్‌చార్జ్ నరేశ్, కళాశాల యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

దుబ్బాకటౌన్: ప్రజలు అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని దుబ్బాక ఫైర్ స్టేషన్ లీడింగ్ ఫైర్‌మెన్ రాజేశ్ అన్నారు. దుబ్బాక పట్టణంలోని దిశ స్కూల్, మున్సిపల్ పరిధిలోని లచ్చపేటలో విశ్వం కిరాణ దుకాణాల వద్ద ఫైర్ సేఫ్టీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలి

హుస్నాబాద్: వ్యవసాయ మార్కెట్‌లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ అయిలేని మల్లిఖార్జున్ రెడ్డి డిమాండ్ చేశాడు. బుధవారం ఆయన రైతులతో కలిసి మార్కెట్ కార్యదర్శి సుజన్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు.

◆ మాలల సంక్షేమానికి ప్రభుత్వం చొరవ చూపాలి

గజ్వేల్‌రూరల్: మాలల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని మాలమహానాడు గజ్వేల్ డివిజన్ అధ్యక్షుడు మన్నె శేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు ఎల్లేశ్ ఆధ్వర్యంలో ఆ సంఘం గజ్వేల్ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా జగదేవ్‌పూర్ మండలం పీర్లపల్లికి చెందిన కమ్మదారి రమేశ్‌ను నియమించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మన్నె శేఖర్ మాట్లాడుతూ.. మాలలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూడడం తగదన్నారు. మాలలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వాలు అండగా నిలవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

◆ క్రీడా సామగ్రి అందజేత

మిరుదొడ్డి(దుబ్బాక): డీసీసీబీ డైరెక్టర్ బక్కి వెంకటయ్య సహకారంతో అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని మహారాజ్ యూత్ సభ్యులకు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఎర్మని దుబ్బరాజం, ఉపసర్పంచ్ వడ్ల ప్రభాకర్‌లు బుధవారం క్రీడా సామగ్రిని అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఐతం శ్రీనివాస్, వార్డుసభ్యులు దోమకొండ స్వామి, నంద్యాల కిషన్, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

◆ సాయికిరణ్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండల కేంద్రానికి చెందిన నాచగొని సాయికిరణ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నాచగొని సాయికిరణ్ జయంతి పురస్కరించుకొని బుధవారం జనగామ జిల్లాల్లోని వర్ధన్ ఆశ్రమంలో పిల్లలక పండ్లు పంపిణీ, అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ వారు మాట్లాడుతూ.. కుమారుడి మృతితో కుంగిపోకుండా అతని పేరుపై ట్రస్ట్ ఏర్పాటు చేసి వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న మాజీ సర్పంచ్ నాచగొని పద్మ, ట్రస్ట్ చైర్మన్ నాచగొని లక్ష్మణ్‌గౌడ్ దంపతులను పలువురు అభినందించారు.

◆ వసతి గృహాలను మూయడం సరికాదు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులు లేరనే నెపంతో వసతి గృహాలను మూసివేయడం సరికాదని ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు అరవింద్, ప్రశాంత్‌లు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అరవింద్, ప్రశాంత్‌లు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 100 వసతి గృహాలను విద్యార్థులు లేరన్న పేరుతోనే మూసివేసే నిర్ణయం తీసుకుంటుందని, ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అన్నారు. ఈ నిర్ణయంతో గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు చదువుకు దూరం కానున్నట్లు తెలిపారు. దళిత, గిరిజన, ఆదివాసీ, బడుగు, బలహీన వర్గాల విద్యారులు వసతి గృహాల సదుపాయాలు కల్పిస్తేనే చదువుకుంటారన్నారు. మూసివేత పేరుతో సంక్షేమానికి నిధులు తగ్గించి, పేద విద్యార్థులకు చదువును దూరం చేసే కుట్రలా ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

◆ గాజులపల్లిలో స్టీల్ బ్యాంక్ ఏర్పాటు

దుబ్బాక: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా దౌల్తాబాద్ మండలం గాజులపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం స్టీల్ బ్యాంకును ఏర్పాటు చేశారు. ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో వివిధ వార్డులకు చెందిన సభ్యులు పాల్గొన్నారు.

◆ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన

కొమురవెల్లి(సిద్దిపేట): తమ ప్రొబేషన్ పూర్తయిన రెగ్యులర్ చేయడం లేదనే నిరసనతో మండలంలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు బుధవారం నల్లబ్యాడ్జీలను ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు సంవత్సరాలకే తమను రెగ్యులర్ చేస్తామని చెప్పిన ప్రభుత్వం మరో ఏడాది పొడగించిందన్నారు. ఇప్పటికైనా తమను రెగ్యులర్ చేయాలని అన్నారు. కార్యక్రమంలో సతీష్, మురళి, కిరణ్, బాల్‌రాజు, పంచాక్షరి తదితరులు పాల్గొన్నారు.

◆ రోగులకు పండ్ల పంపిణీ

దుబ్బాక: కాంగ్రెస్ పార్టీ దుబ్బాక ఇన్‌చార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆ పార్టీ నాయకులు దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఏసురెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

◆ హామీల అమలులో ప్రభుత్వం విఫలం

బెజ్జంకి(సిద్దిపేట): నిరుపేదలకు డబుల్ బెడ్రూంలు ఇవ్వడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు, మానకొండూర్ ఇన్‌చార్జ్ కవ్వంపెల్లి సత్యనారాయణ ఆరోపించారు. మండలంలోని బేగంపేటలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2018లో బేగంపేటలో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేసి పనులు విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. పనులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. కార్యక్రమాలలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, మాంకాలి ప్రవీణ్, శీలం నర్సయ్య, డీవీ రావు, అమరేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, రాజు, మహేందర్, వెంకటాచారి, తిరుపతిగౌడ్, రమేశ్, బుడిగజంగాల మహిళలు, తదితరులు పాల్గొన్నారు.